రోడ్లు పాడవుతున్నా పట్టించుకోరా?



- కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రహదారుల ధ్వంసం
- కొట్లాది ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



మల్లాపూర్ మండలంలో రహదారిపై వెళ్తున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్(ఫైల్)

మల్లాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఎన్ని వందలాది కోట్ల నిధులు వెచ్చిస్తున్నా... ఫలితం ఉండడం లేదు. పట్టుమని రెండేళ్లు కూడా గడవకముందే రహదారులు నరకదారులుగా మారుతున్నాయి. వీటంతటికీ కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరగడమే ప్రధాన కారణం. రహదారుల నిర్మాణాలతో రవాణా మెరుగై పల్లెలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం వందల కోట్లతో నిర్మించిన రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు తిరుగుతుండడంతో మున్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. ఫలితంగా ఆ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంటల సాగు సీజన్లు వానాకాలం, యాసంగిలలో పలు గ్రామాల్లో కేజ్ వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడుపుతుండడంతో ఆ రహదారులు కొన్ని నెలలకే ఛిద్రమవుతున్నాయి.

మండలంలో..

మండలంలోని పలు మార్గాల్లో నిర్మల్–జగిత్యాల 61 వ నంబర్ జాతీయ రహదారితో పాటు డబుల్ రోడ్లు, లింక్‌రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు వందల కోట్ల నిధులను మంజూరు చేసింది. కొన్ని మార్గాల్లో పనులు పూర్తవగా, మరికొన్ని మార్గాల్లో డబుల్‌రోడ్డు, లింక్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రహదారులపైనే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో రోడ్ల మధ్య పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. కొన్ని మార్గాల్లో రోడ్లు ధ్వంసమై కంకర తేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో తిరగాల్సిన కేజ్ వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో గీతలు పడి ద్విచక్రవాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడుపుతుండడంతో 15 ఏళ్ల పాటు మన్నిక ఉండాల్సిన రహదారులు కేవలం ఒకటి, రెండేళ్లకే ధ్వంసమై గుంతలు, పగుళ్లు, గీతలు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంత జరుగుతున్నా ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

కనిపించని చర్యలు..

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్డెక్కితే.. నేషనల్ హైవే, ఆర్ అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సదరు ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కానీ చర్యలు తీసుకున్నట్లు ఇప్పటి వరకు మండలంలో ఎక్కడా కనిపించలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యాన్ని అవకాశంగా తీసుకుంటున్న ట్రాక్టర్ల యజయానులు యథేచ్ఛగా కేజ్‌వీల్స్‌తో రోడ్లనే దున్నేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేజ్‌వీల్స్‌కు పట్టీలు వేసుకుని ఉపయోగించుకోవాలి. బీటీ రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్‌తో నడుపుతూ కనిపిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేసి జరిమానా విధిస్తాం. రహదారి భద్రతకు అందరు సహకరించాలి. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపైకి నడపొద్దని గ్రామాల్లో ప్రచారం చేయిస్తా.

– కోన రాజు, ఎస్సై, మల్లాపూర్

క్లుప్తంగా

నృసింహుని సన్నిధిలో ఆదిలాబాద్ జిల్లా జడ్జి పూజలు



న్యాయమూర్తి దంపతులకు ప్రసాదం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆదిలాబాద్ జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు మేళతాళాలతో స్వాగతం పలికారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక మెజిస్ట్రేట్ శ్యామ్‌ప్రసాద్, ఎస్సై ఉదయ్‌కుమార్, వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాస్ సిబ్బంది తదితరులున్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రైతు నాయకులు

మెట్‌పల్లి: రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం నాయకులు మామిడి నారాయణరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, గురిజెల రాజిరెడ్డి, ఎలిసె పాపన్న అన్నారు. పట్టణంలో ఆదివారం మాట్లాడారు. ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించిందని, కానీ దీని అమలు విషయంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అందరితో చర్చించే అభివృద్ధి పనులు చేపట్టాం



మాట్లాడుతున్న చైర్మన్ గంగాధర్

కథలాపూర్: గంభీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి పనులపై చర్చించి అభివృద్ధి పనులు చేశామని చైర్మన్ దాసరి గంగాధర్ అన్నారు. గంభీర్‌పూర్ సొసైటీలో ఆదివారం డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డైరెక్టర్లు సూచించిన అభ్యంతరాలపై సమాధానం చెప్పేందుకు సిద్ధమని చైర్మన్ స్పష్టం చేశారు. నిబంధనల మేరకు పెట్రోల్ బంక్ స్థలం ఎంపిక విషయంలో వ్యవహరించామని, కొందరు రాజకీయ స్వార్థం కోసం తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం, మకరతోరణాల ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న దంపతులు

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దివ్యమూర్తుల మకర తోరణాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో హైకోర్టు అడ్వకేట్ బైరినేని ప్రదీప్‌రావు–కవిత దంపతులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్ నిధులు కేటాయించడంలో పూర్తిగా అన్యాయం చేసిందని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం సారంగాపూర్‌లో మాట్లాడారు. తెలంగాణ నుండి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు తీసుకరావడంలో పూర్తిగా విఫలమయ్యాయరని అన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ప్రజలకు బడ్జెట్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మసర్తి రమేష్, గుడిసె జితేందర్, కొంద్ర రాంచంద్రారెడ్డి, మధుసూదన్, సత్యంరావు, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మల్లాపూర్:ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మల్లాపూర్ మండలంలోని నడికుడలోని ఆదివారం శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.రాబోయే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంభీర్‌పూర్‌లో జిల్లా సహకార అధికారి విచారణ

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వ్యవహారంపై జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. గంభీర్‌పూర్ గ్రామశివారులో సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం కొనుగోలు చేసిన భూమి అనుమతులు రద్దు చేశామన్నారు. భూమి కోసం చైర్మన్‌కు చెల్లించిన డబ్బులను రికవరీ చేస్తామన్నారు.

ఉద్యోగులకు సన్మానం

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి నుంచి వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఐదుగురిని గ్రామ యువకులు ఆదివారం సన్మానించారు. చందనగిరి పోశన్న, మైదం ప్రశాంత్, బండపెల్లి తిరుపతి, ముత్యాల చంద్రశేఖర్, గౌతమిని సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ ప్రహరీకి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: మండలంలోని అయ్యప్పస్వామి గుడి ప్రహరీకి ఆదివారం రోజున వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ భూమిపూజ చేశారు. మార్కండేయస్వామి గుడి నిర్మాణనికి నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంగోని రాజగౌడ్, చేపూరి నాగరాజ్, బద్దం రాజేందర్ రెడ్డి, శ్రీపతి దామోదర్, అంగడి ఆనంద్, రావు శ్రీనివాస్, నీరటి మల్లేశం, సాయిని గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణం

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం రథోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం



సీఐని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

మెట్‌పల్లి: విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే మంచి పౌరునిగా ఎదుగుతారని సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విజయసాయి సెంట్రల్ స్కూల్‌లో శనివారం రాత్రి జరిగిన వార్షికోత్సవ వేడుకలకు సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు గురువుల పట్ల గౌరవభావం తగ్గడం బాధాకరమన్నారు. ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సీఐని పాఠశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ పుల్లా ప్రదీప్‌గౌడ్, డైరెక్టర్ శ్రీరామ్ భూపాల్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా శాంత

మల్యాల: బీడీ ఫెడరేషన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మల్యాల మండల కేంద్రానికి చెందిన కొక్కుల శాంతను నియమించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బి.గోవర్దన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, కోశాధికారి ముఖ్రం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కొక్కుల శాంతను నియమించారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తానని శాంత అన్నారు.

మున్నూరు కాపు అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగారెడ్డి

సారంగాపూర్: మండలంలోని పోతారంలో ఆదివారం మున్నూరు కాపు వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్యాల గంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కటుకం సతీశ్, ప్రధాన కార్యదర్శిగా రంగ సత్తయ్య, కోశాధికారిగా రౌతు రమేశ్, న్యాయ సలహాదారుగా మ్యాడ ఐలయ్య, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా సతీశ్

రాయికల్: మండలంలోని భూపతిపూర్ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా కటకం సతీష్, ఉపాధ్యక్షులుగా మామిడాల వెంకటాద్రి, జక్కుల సాగర్, ప్రధాన కార్యదర్శిగా వాసాల రమేశ్, కోశాధికారి భోగ సత్తయ్య, సంయుక్త కార్యదర్శిగా వాసాల మహేశ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సరస్వతీ శిశుమందిర్‌లో ఆత్మీయ సమ్మేళనం



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న పూర్వ ఆచార్యులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు, ఆచార్యులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల సంస్కృతీసంప్రదాయాలకు నెలవని,ఈ పాఠశాలల్లో చదివాన పిల్లలు క్రమ శిక్షణకు మారు పేరుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేముల ప్రభాకర్, గోల్కొండ నాగరాజు, నీలి శ్రీనివాస్, చంద్రమోహన్, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌పల్లిలో తాగు నీటికి కటకట



సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లిలో తాగు నీటికి కటకట ఏర్పడింది. డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు సమీపంలోని నాయకపు గూడెం, ఒడ్డెర కాలనీ గ్రామాలకు తాగునీటి కోసం ఒకే రక్షిత మంచినీటి బావి ఉండగా, డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద బోరు చెడిపోవడంతో తాగునీరు, ఇతర అవసరాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సైతం సక్రమంగా రాకపోవడంతో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్ సెల్ నంబర్: 9440468508

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

'లక్ష డప్పులు వెయ్యి గొంతులు' పోస్టర్లు ఆవిష్కరణ



ధర్మపురిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోదుంపల్లి అంజయ్య, కొత్తూరి బాబు ఆధ్వర్యంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఆరెల్లి లక్ష్మీరాజం, బాలె అంజయ్య, ఆత్మకూరు చందూ, బొమ్మెన స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో 'లక్ష డప్పులు వేయి గొంతుకలు' పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నలువాల సంజీవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్యాల ఈశ్వర్, మునుగూరి లక్ష్మణ్, శంకరయ్య, శ్రీనివాస్, విజేందర్, సురేశ్, నివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి: లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు చిలుముల లక్ష్మణ్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం లక్ష డప్పులు వెయ్యి గొంతులు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పారపెల్లి రాజమల్లయ్య, అరికెల్ల సతీష్, మోకెనపెల్లి సతీష్, పాల్గొన్నారు.

రాయికల్ : ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వేయి గొంతులు అనే పోస్టర్ ను ఆదివారం రాయికల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాపురపు నర్సయ్య, తలారి రాజేష్, దొబ్బల వేణు, లింగంపల్లి రాజేష్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎల్ విజేత ఎస్‌టీఆర్ రాంరెడ్డి రైజర్స్



విన్నర్ టీం ఎస్‌టీఆర్ రాంరెడ్డి జట్టు క్రీడాకారులు

రాయికల్: రాయికల్ ప్రీమియర్ లీగ్ –3 క్రికెట్ టోర్నీ ఎస్‌టీఆర్ రాంరెడ్డి రైజర్స్ విన్నర్ నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో ఏడీఆర్ దివాకర్ రెడ్డి వారియర్స్ రన్నర్‌గా, మూడో స్థానంలో ఎమ్మార్ సూపర్ కింగ్స్ నిలిచాయి. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా చిట్టెటి విక్రంరెడ్డి తో పాటు విన్నర్ జట్టుకు రూ.30 వేల నగదు, ట్రోఫీని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ అధినేత భోగ రవి ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు,స్పాన్సర్లు ఇందూరు గంగాధర్, కిరణ్ రెడ్డి, డాక్టర్ గట్టు నరేష్, డాక్టర్ ఉదయ్ కుమార్, హరీష్,ఆర్గనైజర్లు పాల్గొన్నారు. రాయికల్ క్రికెట్ లీగ్ సీజన్ –3 ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆదివారం రాయికల్ ప్రెస్ క్లబ్, నిర్వాహకుల మధ్య జరిగింది. విజేతగా రాయికల్ ప్రెస్ క్లబ్ నిలిచింది. వీరికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు ,స్పాన్సర్ గంగాధర్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

కొమురయ్యకు తపస్ మద్దతు

జగిత్యాలటౌన్: నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మద్దతు ప్రకటించింది. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన తపస్ జిల్లా సమావేశంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య పాల్గొని మద్దతు కోరగా తపస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తపస్ అధ్యక్ష,కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి వెంకటరమణారావు, రాష్ట్ర బాధ్యులు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేయి స్తంభాల గుడి వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాస్టల్ విద్యార్థుల స్టడీ టూర్

సారంగాపూర్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఆదివారం స్టడీ టూర్‌కు వెళ్లారు. సారంగాపూర్‌తో పాటు జిల్లాలోని 11 సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద మంది రామప్ప, భద్రకాళీ టెంపుల్, లక్నవరం, వేయి స్తంభాల గుడి తదితర ప్రాంతాలను సందర్శించారు. వారి వెంట ఆయా వసతి గృహాల సంక్షేమాధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పట్నాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.



పోచమ్మ ఆలయంలో చలి బోనాలు



రాయికల్: పట్టణం తోపాటు మండలంలోని 32 గ్రామాల్లో మాఘ మాస సందర్భంగా మహిళలు ఆదివారం ఉదయం నుంచే పోచమ్మ తల్లికి చలి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.